

అక్కన్నపేట: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొంటున్న దళారులు


నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, శనివారం 20 ఏప్రిల్ 2024 | SIDDIPET


కల్లాల వద్దకు వెళ్లండి.. సర్కారు వడ్లు కొనేదాకా బాసటగా నిలవండి



# అన్నదాత ఆక్రందన

## కొనుగోలు కేంద్రాల్లో జరగని కాంటాలు... ఆందోళనలో రైతన్నలు

ఆరుగాలం కష్టించి పండించిన వడ్లను అమ్ముకుందామంటే అన్నదాతకు అరిగోస అవుతున్నది. యాసంగిలో పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెస్తే కాంటా కావడం లేదు. 10 రోజులు దాటినా వడ్ల కాంటా పెట్టక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు తాలు, తేమశాతం, తరుగు పేరిట నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 1039 కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నా, వాస్తవానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరేలా ఉన్నాయి. ఇందులో సగానికి సగం కేంద్రాల్లో సేకరణ జరగడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కరువయ్యాయి. గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు సరిపడా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతులు కొనుగోలు కేంద్రానికి వడ్లను తేగానే తూర్పార పట్టుమంటున్నారు. అందుకు తగ్గట్టుగా కొన్ని సెంటర్లలో ప్యాడీ క్లీనర్ లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్యాడీ క్లీనర్ అడిగితే మీరే బయట తెచ్చుకోవాలని నిర్వాహకులు సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

*–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 19*



సిద్దిపేటరూరల్: చిన్నగుండవెల్లి ఐకేపీ సెంటర్‌కు వచ్చిన ధాన్యం



నంగునూరు: అక్కెనపల్లిలో రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులు

### వారం పది రోజులకు కాంటా

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 19: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో సింగిల్ విండో సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన సెంటర్‌లో ధాన్యం సేకరణ వేగంగా జరగడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు ఇక్కడికి పెద్ద సంఖ్యలో ధాన్యం తెస్తున్నారు. వడ్లు ఆరబోసుకునేందుకు స్థలం సరిపోకపోవడంతో రైతులు తెచ్చిన ధాన్యం కుప్పలు కుప్పలుగా రోజుల తరబడి ఉండిపోతున్నది. ఆరబోసిన ధాన్యం కొనుగోలు చేస్తే తప్ప మరోరైతు ధాన్యం ఆర బోసుకునే పరిస్థితి మార్కెట్ యార్డులో లేదు. వారం నుంచి పదిరోజుల వేచిఉంటే తప్పా కాంటా కావడం లేదని రైతులు వాపోతున్నారు.

### హమాలీల కొరత తీవ్రంగా ఉంది..



బెజ్జంకి మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత చాలా ఉంది. మా వడ్లు తూకం వేశారు. వర్షం వస్తే తడిచేలా ఉంది. చాలామంది రైతులం సెంటర్ నిండా వడ్లు పోసినాం. హమాలీలు తక్కువగా ఉండటంతో తూకం ఆలస్యం అవుతున్నది. దీనికి తోడు లారీల కొరతతో వడ్ల లోడ్లు వెళ్లడం లేదు. అధికారులు స్పందించి హమాలీలను పెంచి వేగంగా తూకం వేసి రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించాలి. *– రాజేందర్, రైతు, బెజ్జంకి*

### వడ్లు కాంటా పెడతలేరు



కొనుగోలు కేంద్రానికి వడ్లను తీసుకొచ్చి పది రోజులు అవుతుంది. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రంలో కాంటా పెడతలేరు. అధికారులు పట్టించుకోవట్లేదు. రోజు సాయంత్రం ఉరుములు మెరుపులతో వాన మొగులైతే భయం వేస్తుంది. అధికారులు వెంటనే వడ్లను కొనాలి.

*– కనకయ్య, రైతు, ఓబులాపూర్, చిన్నకోడూరు మండలం*

### వడ్లెప్పుడు కొంటారో తెలియడం లేదు



వడ్లు తీసుకువచ్చి ఎనిమిది రోజులు అవుతుంది. కనీసం సౌకర్యాలు కూడా లేవు. తాగుదామంటే నీళ్లు లేవు. వడ్లు కొనేటోళ్లు కూడా లేరు. మా రైతులను ఎవరూ పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా అధికారులు రైతులను పట్టించుకొని వడ్లను కొనాలి. వాన మొగులు అయితే భయం వేస్తుంది.

*– మాదన్నగారి ఎల్లవ్వ, రైతు, నారాయణరావుపేట*

### వానతోని భయంగా ఉంది..



సిద్దిపేట మార్కెట్లోకి ట్రాక్టర్ వడ్లు తీసుకొచ్చి పోసిన. వారం రోజు లైతాంది. బాయి కాన్నే ఆరబెట్టుకొని వడ్లు తెచ్చిన. రాంగానే కొనలేదు. ఇంతల్నే వాన పడ్డది. వడ్లు తడిసినయి. పచ్చిగున్నయి మల్ల ఆరబెట్టాలన్నరు. మొత్తం ఎండపోసిన.. రోజు రోజు వడ్లు వత్తున్నయి. ఆరబెట్టేందుకు జాగ ఉంటలేదు. ఇప్పుడు మొత్తం ఎండినయి. మధ్యాహ్నం (శుక్రవారం) అయితంది. సెలక్షన్ చేసేటోళ్లు ఇది వరకు రాలె. మొగులును చూత్తే భయమైతంది. వానెప్పుడు పడుతదోనని.. టార్పాలిన్ కవర్లు ఇంటి నుంచే తెచ్చుకున్న.. ఇక్కడ అడిగితే పాసుబుక్కులు కావాల్నట. మార్కెట్ల గోస అయితాంది.. ఎంబడెంబడి వడ్లను కొని తీసుకపోవాలె.

*– చంద్రం, కాళ్లకుంట కాలనీ, సిద్దిపేట*

### వారం కిందట తీసుకొచ్చిన..



నారాయణరావుపేట కొనుగోలు కేంద్రానికి వారం రోజుల కింద వడ్లు తెచ్చిన. ఇప్పటి వరకు వడ్లు కొనడానికి ఒక్క అధికారి కూడా రాలేదు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. రైతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం వడ్లు ఎప్పుడు కొంటారో కూడా చెప్పడం లేదు.

*–గుర్రం సత్తిరెడ్డి నారాయణరావుపేట*

### వడ్లను కొంటలేరు..



అంజుమాన్ బ్యాంకోళ్లు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిండ్రు. కానీ, వడ్లను కాంట పెడుత లేరు. నేను ఈడ వడ్లను పోసి ఇయ్యాలటికి 6 రోజులు ఐతుంది. మొన్న వాన చినుకులు పడితే టార్పాలిన్ కవరు ఇయ్యంటే మీరే కొనుకొమ్మని అంజుమాన్ బ్యాంకోళ్లు చెప్పిండ్రు. వడ్లు నానకుంట ఉండడానికి టార్పాలిన్ కవర్లను కిరాయికి తెచ్చుకున్నా. రెండు రోజుల్లో వడ్లను ఈడ కొనకుంటే ఎంతో కొంతకు బయట సేట్లకే వడ్లను అమ్ముకుంట.

*–కొమ్మురి బాపురెడ్డి, రైతు, మిరుదొడ్డి.*



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం

### బోనస్‌పై చేతులెత్తేసిన కాంగ్రెస్



వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇవ్వడం లేదు.ఐకేపీ కేంద్రాలకు వడ్లు వచ్చే సమయానికి చేతులెత్తేసింది. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, డిసెంబర్ 9న అధికారంలోకి వస్తున్నామని..మాఫీ చేస్తామని టీవీల్లో, పత్రికల్లో ఊదరగొట్టారు. రైతులు నిజంగానే నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే పంగనామాలు పెట్టిండు రేవంత్‌రెడ్డి. ఇప్పుడు ఎన్నికలు ఉన్నాయని ఆగస్టులో రుణమాఫీ చేస్తానని కొత్తపాట ఎత్తుకుండు.

*– రామరామగిరి దుర్గారెడ్డి, రైతు, చిన్నగుండవెల్లి గ్రామం, సిద్దిపేట రూరల్ మండలం*



వరికి బోనస్ 500 ఇవ్వకపోగా..

రైతుకు రూ.400 నష్టం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు

బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అన్నదాతల వ్యతిరేకులు

పోస్టుకార్డుల ఉద్యమం హోరెత్తాలి..

ప్రతి పల్లెలో.. ప్రతి రైతుతో పోస్ట్‌కార్డు రాయించాలి...

సిద్దిపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు

# రైతులకు అండగా నిలవండి

సిద్దిపేట, ఏప్రిల్ 19: ధాన్యం సేకరణలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని, బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు వారికి అండగా నిలవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వడ్లకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2203 ప్రకటించినా, 15 రోజుల నుంచి ధాన్యం కొనడం లేదని విమర్శించారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోవడంతో రైతులు వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకొని నష్టపోతున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. వ్యాపారులకు రూ. 1800లకు క్వింటాల్ ధాన్యం అమ్ముకోవడంతో రైతు రూ. 400 నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 500 బోనస్ ఇవ్వకపోగా, రైతులకు 400 నష్టం చేస్తున్నారని కాంగ్రెస్ సర్కారు తీరును హరీశ్‌రావు దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చివరి గింజ వరకూ కొని మద్దతు ధర ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ రైతు వ్యతిరేకులని, వారికి రైతు సంక్షేమం పట్టదని హరీశ్‌రావు విమర్శించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు రైతులకు ఎడ్లు, నాగలి ఇస్తా అని మోసం చేశాడని, దుబ్బాక ఎన్నికల్లో మోసం చేసిన రఘునందన్‌ను మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టారన్నారు. దుబ్బాకలో చెల్లని వ్యక్తి మెదక్‌లో ఎట్ల చెల్లుతాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేదాకా రైతుల పక్షాన పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కల్లాల వద్దకు వెళ్లాలని, సీఎంకు పోస్ట్ కార్డు రాసి పంపాలన్నారు. ప్రతి గ్రామంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టి రైతులకు అండగా నిలవాలన్నారు. కొనుగులు కేంద్రాలు ప్రారంభమయ్యేలా రెవెన్యూ అధికారులను అడగాలని, లేనిపక్షంలో రైతులకు అండగా రాస్తారోకోలు, ధర్నాలు, ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు.



అక్కన్నపేట: కుందన్‌వానిపల్లిలో ధాన్యం కొంటున్న వ్యాపారులు



రాఘవాపూర్ నుంచి రావురూకుల వరకు రోడ్డుపై పోసిన ధాన్యం



### జప్పజప్ప కొంటలేరు..

ఇదివరకు జప్ప జప్ప వడ్లు కొొందురు. ఇప్పుడు వారం రోజులు అయితాంది. వారం కిందట వడ్లు తెత్తే ఈడ ఆరబోద్దమంటే జాగలేదు. జాగ దొరికినంక మల్ల ఎండపోసినం. ఇప్పుడు వడ్లు అన్ని పట్టినంకనే మయ్చిర్ సూత్తమని సార్లు చెప్పుతుండ్రు. వొ దిక్కు మబ్బులు వత్తన్నయి. వానపడితనా ఒక్క ఇత్తుకూడ పనికిరాదు. దనదన కొనెతట్టు సూడుండ్రి సారు.

*–గంగరవేని సుగుణ, రైతు, పోతారం(ఎస్)*



శుక్రవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచలోని కొనుగోలు కేంద్రంలో నీట మునిగిన ధాన్యం రాశులు

# 24గంటల్లో నిందితులను అరెస్టు చేయాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటకయ్య



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ బక్కి వెంకటయ్య

రామాయంపేట, ఏప్రిల్ 19: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను 24గంటల్లో పోలీసులు అరెస్టు చేయాలని, ఈ విషయమై జిల్లా ఎస్పీతో మాట్లాడుతానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. శుక్రవారం రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్‌లో ఆయన పర్యటించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని మహిళలతో మాట్లాడారు. దోషులెంతటి వారైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మహనీయుడికి అవమానం జరగడం మంచి పద్ధతి కాదని, నిందితులు ఎంతటి వారైనా శిక్షార్హులేనని అన్నారు. ఆయన వెంట దళిత బహుజన నాయకులు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనువాస్, పాతూరి రాజు, లద్ద నర్సింహులు, కిషన్, కరికె విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

# రెండోరోజు నాలుగు నామినేషన్లు

- మెదక్ జిల్లా రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్




ప్రజా వెలుగు పార్టీ నుంచి నామినేషన్ వేస్తున్న సారా యాదగిరిగౌడ్

మెదక్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): మెదక్ పార్లమెంట్ స్థానానికి రెండోరోజు శుక్రవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 25 వరకు నామినేషన్లను స్వీకరించనుండగా.. ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మెదక్ పార్లమెంట్ స్థానానికి మెదక్ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. శుక్రవారం ప్రజా వెలుగు పార్టీ నుంచి సారా యాదగిరిగౌడ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్‌కు అందజేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా బొమ్మల విజయ్ కుమార్, తుమ్మలపల్లి పృథ్వీరాజ్ నామినేషన్లు వేశారు. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గొల్లపల్లి సాయిగౌడ్ నామినేషన్ వేశారని రిటర్నింగ్ అధికారి రాహుల్‌రాజ్ తెలిపారు.

**మూడంచెల భద్రత**

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి మెదక్ కలెక్టరేట్‌లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. నామినేషన్ పత్రాల దాఖలులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా నామినేషన్ల దాఖలు జరిగేలా నిఘా ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బి.బాలస్వామి పర్యవేక్షణలో నిత్యం నామినేషన్ల స్వీకరణలో డీఎస్పీ డాక్టర్ రాజేశ్‌తో పాటు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.

### ఫుట్‌బాల్ అండర్-20 టీం కెప్టెన్‌గా సిద్దిపేట వాసి

సిద్దిపేట, ఏప్రిల్ 19: తెలంగాణ ఫుట్‌బాల్ అండర్-20 టీం కెప్టెన్‌గా సిద్దిపేట బిడ్డ పిట్ల సాయి యశ్వంత్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. యశ్వంత్ సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ అక్బర్ నవాబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సిద్దిపేట గ్రౌండ్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. సిద్దిపేట నుంచి యూనివర్సిటీ లెవెల్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి కమిటీ దృష్టిలో పడ్డాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్‌కు ఆడుతున్న యశ్వంత్ తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ అండర్-20 టీమ్‌కు కెప్టెన్‌గా నియమితులయ్యారు. దీంతో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో సంబురాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ అక్బర్ నవాబ్ మాట్లాడుతూ.. యశ్వంత్ ప్రతిభ గల క్రీడాకారుడని, మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవతో ఏర్పాటు చేసిన సిద్దిపేట ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆట నేర్చుకుని హైదరాబాద్‌లో మరింత రాటుదేలాడని తెలిపారు. ఏదో ఒకరోజు జాతీయ స్థాయిలో ఆడతాడని ధీమా వ్యక్తం చేశారు.



సాయి యశ్వంత్

# గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతునవుతా

- కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



హుస్నాబాద్‌లో న్యాయవాదులతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 19: ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే వచ్చే ఐదేండ్లు పార్లమెంటులో ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతునవుతానని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు, కక్షిదారులతో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయవాదులు, మేధావులు, విద్యావంతులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. మొదటిసారి ఎంపీగా గెలిచి తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించానని, రెండోసారి 2014లో గెలిచిన అనంతరం రూ.వెయ్యికోట్లతో కరీంనగర్ స్మార్ట్‌సిటీ, రెండు హైవేలు, ఒక రైల్వే ప్రాజెక్టు తెచ్చానని చెప్పారు. తీగెల వంతెన, మానేరు రివర్ ఫ్రంట్, ఐటీ టవర్, నైట్ లైట్ నిర్మాణం చేశానన్నారు. టీటీడీ నుంచి రూ. 25కోట్లు తెచ్చి వేంకటేశ్వరాలయం నిర్మాణం చేయిస్తున్నట్లు చెప్పారు. బండి సంజయ్ ఎంపీగా ఐదేండ్లలో ఐదు రూపాయలు కూడా తేలేదన్నారు. అతనికి పదవి మీద ధ్యాస తప్ప ప్రజా సమస్యల మీద ఉండదని విమర్శించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లను శాలువాలతో సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, బీఆర్‌ఎస్ నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, ఎండీ అన్వర్, వంగ వెంకట్రాం రెడ్డి, రవీందర్‌గౌడ్, కన్నోజు రామకృష్ణ, ధీకొండ ప్రవీణ్, అజయ్‌కుమార్, సతీశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ స్థానానికి మూడు నామినేషన్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి శుక్రవారం రెండోరోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ముగ్గురు అభ్యర్థులు స్వతంత్రులు కావడం విశేషం. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ శెట్కార్ తరపున ఒకసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతికి అందజేయగా, రెండోరోజు స్వతంత్ర అభ్యర్థులు బి.మారుతిరావు, కె.ఆనందీశ్వర్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. మరో స్వతంత్ర అభ్యర్థి మహాదేవ్ స్వామి రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. జహీరాబాద్ స్థానానికి ఇప్పటి వరకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి మాట్లాడుతూ.. అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీసు బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం affidavit.eci.gov.in ప్రత్యేక వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

### నేడు నామినేషన్ వేయనున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి

సంగారెడ్డి, ఏప్రిల్ 19: జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ శనివారం నామినేషన్ వేయనున్నారు. ఈ స్థానానికి ఇదివరకే కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌తో పాటు మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. శనివారం ఉదయం 11 గంటలకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతికి నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో పాటు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.